

గవర్నర్‌కు ఆంజనేయస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గాలి

అంజనాద్రి కొండను సందర్శించిన

మేఘాలయ గవర్నర్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మేఘాలయ గవర్నర్ విజయ్ శంకర్.. సతీమణి శకుంతలతో కలిసి ప్రసిద్ధి చెందిన అంజనాద్రి కొండను ఆదివారం సందర్శించారు. గవర్నర్‌కు గంగావతి ఎమ్మెల్యే గాలిజనార్దన్‌రెడ్డి స్వాగతం పలికారు. కొండ దిగువున ఉన్న ఆంజనేయస్వామి విగ్రహానికి గవర్నర్ దంపతులు పూజలు చేయించారు. అనంతరం జనార్దనరెడ్డి గవర్నర్‌కు ఆంజనేయస్వామి చిత్రపటాన్ని అందించారు. మాజీ ఎంపీ శివరామేగౌడ, శాసనమండలి మాజీ సభ్యుడు కరియన్న, మాజీ ఎమ్మెల్యే పరన్నమునవల్లి, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజేశ్వరి పాల్గొన్నారు.





మంత్రేతరులకు కేబినెట్ హోదాపై హైకోర్టు

సీరియస్..!

- 48 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు లబ్ధి
- సర్కారును వివరణ కోరిన న్యాయస్థానం

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏదైనా అధికార పార్టీకి చెందిన ముఖ్యులకు మంత్రి పదవులు ఇవ్వడం సాధ్యంకాని పరిస్థితి. అందుకే వివిధ హోదాల్లో నియామకాలు జరిపి వారికి కేబినెట్ హోదా ద్వారా అవకాశం కల్పిస్తారు. ఇదో రకమైన రాజకీయ గౌరవ హోదాగా ఉంటుంది. ఈ విధానం అమలు చేయకపోతే సీనియారిటీ, కుల, జిల్లాల, రీజియన్‌లవారీగా కేబినెట్‌లో అన్యాయం జరిగిందని ఒకేసారి భిన్నమైన గ్రూపులు తెరపైకి వస్తాయి. వాటిని సముదాయించేందుకే కేబినెట్ హోదాతో సలహాదారులు, రాజకీయ కార్యదర్శులు వంటి ఇతర పోస్టులకు నామినేట్ చేస్తారు.

● ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిపి 48 మందికి కేబినెట్ హోదా కల్పించారు. వీరిలో కొందరు ఉభయసభలలోనూ సభ్యులుగా లేనివారు కూడా ఉన్నారు. చట్టానికి వ్యతిరేకమైన కేబినెట్ హోదాలు సరికాదని హైకోర్టులో దాఖలైన పిటీషన్‌పై ధర్మాసనం సీరియస్‌గా పరిగణించింది. ఇందుకు సమాధానం ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించింది. ప్రతివాదులకు హ్యాండ్ సమన్లను జారీ చేసింది. మరో నెలరోజులకు మార్చి 27న ఈ అంశంపై విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది. ఇదో తీవ్రమైన అంశమని ప్రాథమికంగా పిటిషన్‌లో రాజ్యాంగం, ప్రజాస్వామ్య, ప్రజాప్రభుత్వానికి సంబంధించిన అంశాలు ఉన్నాయని, విస్తృతంగా విచారణ జరపాలని పిటిషనర్ ప్రస్తావించిన అన్ని అంశాలకు పరిష్కారం చూపాల్సి ఉందని శుక్రవారం ధర్మాసనం న్యాయమూర్తి మౌఖికంగా అభిప్రాయపడ్డారు. ధర్మాసనం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తే ప్రభుత్వానికి షాక్ ఇవ్వడమే కాకుండా అధికార పార్టీలో అల్లకల్లోలం తప్పదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కేబినెట్ హోదా కల్గిన ప్రతివాదులైన శాసనసభ్యులకు హ్యాండ్ సమన్లు జారీ చేయాలని సూచించింది. మార్చి 18లోగా ప్రతివాదులందరూ తమ వివరాలను కోర్టుకు సమర్పించాలని చెప్పింది.

● ప్రతివాదులైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు వివిధ బోర్డులు, కార్పొరేషన్ చైర్మన్‌లు, ముఖ్యమంత్రి సలహాదారులు, న్యాయసలహాదారులు, సీఎం రాజకీయ కార్యదర్శులు, ఢిల్లీలో అధికార ప్రతినిధి హోదాతో నియమించారు. వీరందరికీ కేబినెట్ హోదా కల్పించారు. ఈ నియామకాలు రాజ్యాంగంలోని 102, 192 యాక్ట్, ప్రజాప్రతినిధుల చట్టం 1951కు వ్యతిరేకంగా ఉంది. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఉంది. లాభదాయకమైన హోదాలలో ఉండేవారికి ఈ నియామకాలు రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటిస్తే, వారు పొందుతున్న అన్ని సౌకర్యాలు రద్దు అవుతాయి.

● రాష్ట్ర శాసనసభలో 224 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అధికారం చేపట్టాలంటే 113 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంటుంది. ఇలా ఒక పార్టీ తరఫున 113 మంది లేదా అంతకుమించి, ఇతర పార్టీలు, ఇండిపెండెంట్‌ల సహకారం కూడా ఉండవచ్చు. అయితే కేబినెట్‌లో 34మందికి మాత్రమే మంత్రులయ్యే అవకాశం ఉంటుంది. అందులోనూ ముఖ్యమంత్రితో కలిపి ఉండడంతో సాధారణంగా పోటీ తీవ్రంగానే ఉంటుంది. ఇది ప్రతి ప్రభుత్వంలోనూ కొనసాగే అంశమే. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 135మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు. ముఖ్యమంత్రి పదవి కోసం ప్రారంభంలో తర్జనభర్జన తర్వాత ఎట్టకేలకు అధిష్ఠానం కొలిక్కి తెచ్చింది. అయితే సీఎం సిద్దరామయ్య పూర్తి స్థాయిలో కేబినెట్ మంత్రులందరికీ ఆయన నచ్చినవారే కాకుండా డీసీఎం హోదాలో ఉండే డీకే శివకుమార్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఇలా 34 మంది కూర్పు జరిగింది. ఇందులో కుల, జిల్లా, సీనియారిటీ ప్రాధాన్యతలో పలువురికి అవకాశాలు దూరమయ్యాయి. దాదాపు మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతిసారి మంత్రిగా కొనసాగిన ఆర్‌వీ దేశ్‌పాండేకు చుక్కెదురు అయ్యింది. గత ప్రభుత్వంలో కీలకమంత్రిగా వ్యవహరించిన టీబీ జయచంద్రకు అవకాశం తప్పింది. ఏఐసీసీలో సుదీర్ఘ అనుభవం ఉండి అధిష్ఠానంతో సన్నిహితులనే ముద్రపడిన బీకే హరిప్రసాద్‌కు సైతం మంత్రి పదవి దక్కలేదు. ఇలా ఎంతోమంది ఆశలు పెట్టుకున్నవారికి కేబినెట్‌లో చోటు లభించలేదు. బీకే హరిప్రసాద్ ఏకంగా ఏడాదిరన్నరపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ కీలకులపై విరుచుకుపడ్డారు. ఏకంగా క్రమశిక్షణా కమిటీ నోటీసులు జారీ చేసింది. టీబీ జయచంద్రకు ఢిల్లీలో అధికార ప్రతినిధి హోదా కల్పించి బుజ్జగించారు. ఆర్‌వీ దేశ్‌పాండే అవకాశం వస్తే ముఖ్యమంత్రి రేసులో ఉన్నానని, అటువంటి నన్ను కేబినెట్ నుంచి దూరం చేశారని మండిపడ్డారు. చివరకు ఆయనను సర్దుబాటు చేశారు.

● గతంలో మంత్రిగా వ్యవహరించిన బసవరాజరాయరెడ్డి, సీనియర్ నేత బీసీ పాటిల్ ఆరంభంలోనే వ్యతిరేకత వ్యక్తం చేశారు. గ్రాంట్లు లేవని, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తామని సవాల్ చేశారు. అంతలోనే ఇద్దరికీ సీఎం సలహాదారులుగా కేబినెట్ హోదా కల్పించారు. అందుకు వ్యతిరేకత వ్యక్తం చేసిన మేరకు బీసీ పాటిల్‌కు ప్రణాళికాసంఘం ఉపాధ్యక్ష పదవికి నామినేట్ చేశారు. ఇలా సర్దుబాట్లకోసమే కేబినెట్ హోదాలను కల్పిస్తూ వచ్చారు.

● ప్రస్తుతం కేబినెట్ హోదాలో వివిధ కార్పొరేషన్ల సలహాదారులుగా కొనసాగుతున్నవారిలో హంపనగౌడ బాదర్లి, అప్పాజి సీఎస్ నాడగౌడ, బరమగౌడ ఆలగౌడ కాగె, హెచ్‌వై మేటి, ఎస్‌ఆర్ శ్రీనివాస్, బసవరాజ్ నీలప్ప శివణ్ణవర్, బీజీ గోవిందప్ప, హెచ్‌సీ బాలకృష్ణ, గురుపాదగౌడ, సంగనగౌడ పాటిల్, ఎన్‌ఏ హారిస్, కౌజలగి మహాంతేశ్ శివానంద, పుట్టరంగశెట్టి, జీటీ బాటిల్, రాజావేణుగోపాలనాయక్, టీకే సంగమేశ్వర్, కేఎన్ శివలింగేగౌడ, అబ్బయ్యప్రసాద్, బేళూరు గోపాలకృష్ణ, ఎస్‌ఎన్ నారాయణస్వామి, రఘుమూర్తి, ఏబీ రమేశ్ బండిసిద్దేగౌడ, బీ శివణ్ణ, ఎస్‌ఎన్ సుబ్బారెడ్డి, వినయ్‌కులకర్ణి, అనిల్ చిక్కమాదు, బసనగౌడ దద్దల్, తనీజ్ ఫాతిమా, విజయానంద కాశప్పనవర్, టీడీ రాజేగౌడ, రూపకళ, సతీశ్ సైల్, శరత్‌కుమార్ బచ్చేగౌడ, గణేశ్, బసనగౌడ తురివినాళ్, టీబీ జయచంద్ర, ఏఎస్ పొణ్ణన్న, అజయ్‌సింగ్, ఆర్‌వీ దేశ్‌పాండే, వీఆర్ పాటిల్, నజీర్ అహ్మద్, కే గోవిందరాజు, ప్రకాశ్ హుక్కేరితోపాటు పలువురు ఉన్నారు.

కర్ణాటక పులివేషంపై

ప్రధాని ప్రశంస



బెంగళూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో పులివేషంతో చిందులు వేసే జానపద సంస్కృతిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసించారు. 119వ మన్ కీ బాత్‌లో భాగంగా ఆదివారం దేశప్రజలను ఉద్దేశించి ప్రధాని పలు అంశాలను ప్రస్తావించారు. కర్ణాటకలో పలు విశిష్టమైన విధానాలు ఉన్నాయన్నారు. జానపద కళగా ఉండే పులివేషంతో గంతులు వేయడాన్ని కొనియాడుతూ పులివేషం వేసే కళాకారులను పొగిడారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో ఈ సంస్కృతి ఉందన్నారు. కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లా బీఆర్‌టీ అటవీప్రాంతం అత్యంత ఎక్కువ పులులు ఉన్న ప్రదేశం అన్నారు. అక్కడ పులుల సంరక్షణకు స్థానిక సోలిగర తెగ ఎంతో కృషి చేస్తోందన్నారు. పులుల సంరక్షణ క్రెడిట్ వారిదే అన్నారు. ఇదే సందర్భంలోనే ప్రముఖ కన్నడ వైద్యులు నారాయణ హృదయాలయ ఆసుపత్రుల ముఖ్యులు డాక్టర్ దేవిశెట్టి స్థూలకాయంపై సలహాలను ప్రస్తావించారు. ప్రతి 8మందిలో ఒకరికి స్థూలకాయ సమస్య ఉందన్నారు. వంటనూనెతో బొజ్జ కరిగించుకోవచ్చునని, ఆహారంలో పది శాతం వంటనూనె ఉపయోగించాలన్నారు. డాక్టర్ దేవిశెట్టి సలహాలను ప్రధాని ప్రస్తావించారు. స్థూలకాయానికి ప్రధాన కారణం నాణ్యతలేని ఆహారం, అన్నం, చపాతి, చక్కెరతో తయారయ్యే పదార్థాలతో కార్బోహైడ్రేట్‌లు ఎక్కువగా ఉండడమే కారణమన్నారు. ఆహారంలో మార్పుతో ఆరోగ్యం సాధ్యమన్నారు.

దళితుడిని సీఎం చేయండి

- బీజేపీ నేత, ఎంపీ గోవింద కారజోళ



బెంగళూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయకత్వ మార్పు అంశం ప్రస్తావనకు వస్తున్న తరుణంలోనే దళితుడిని ముఖ్యమంత్రి చేయాలని బీజేపీ సీనియర్ నేత, చిత్రదుర్గ ఎంపీ గోవింద కారజోళ అన్నారు. బెళగావిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికార కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ మార్పు అంశం తీవ్రమైందని, దళిత సామాజిక వర్గం వారిని సీఎం చేయాలని కోరారు. హోం మంత్రి పరమేశ్వర్, పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్పలలో ఒకరిని సీఎం చేయాలన్నారు. అలా సాధ్యం కాకుంటే రాష్ట్రానికి చెందిన సీనియర్ దళితనేత మల్లికార్జున ఖర్గేను ముఖ్యమంత్రి చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, అభివృద్ధి శూన్యమైందన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 20 స్థానాలకు పడిపోతుందన్నారు. సిద్దరామయ్య ప్రభుత్వం అవినీతి వైపు పరుగులు తీస్తోందన్నారు. నాలుగు గ్రూపులుగా విడిపోయి అధికారం కోసం గద్దల్లా కాచుకున్నారన్నారు. ఐదు గ్యారెంటీలకు ఢోకా ఉండదని చెబుతున్నా కాంగ్రెస్ గృహలక్ష్మీ పథకం విషయంలో మాట తప్పుతోందన్నారు. ఇటీవలే ఓ మంత్రి అదేమైనా జీతమా... నెలవారీ ఒకటో తేదీన వేసేందుకు అని వ్యాఖ్యానించడాన్ని ఏమని అర్థం చేసుకోవాలన్నారు. 3 నెలలుగా గృహలక్ష్మి పథకం నగదు విడుదల కాలేదన్నారు. అన్నభాగ్య నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సీఎం సిద్దరామయ్య మోసం చేస్తున్నారని, గత ఏడాది బడ్జెట్‌లో లక్షన్నర కోట్లు విడుదల కాలేదన్నారు. శాంతిభద్రతలు స్తంభించాయని, రోజూ హత్యలు జరుగుతున్నాయన్నారు. సిద్దరామయ్య పాలన అన్నింటా విఫలమైందన్నారు.


పోలీస్‌స్టేషన్‌పై దాడిని ఖండిస్తూ

నేడు చలో మైసూరు

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరం ఉదయగిరి పోలీస్ స్టేషన్, పోలీసులపై దాడిని ఖండిస్తూ బీజేపీ చలో మైసూరుకు పిలుపునిచ్చింది. ఈమేరకు అగ్రనాయకులంతా మైసూరుకు తరలేందుకు సిద్ధమయ్యారు. ఏకంగా పోలీస్‌స్టేషన్‌పై దాడికి పాల్పడటాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సోమవారం జేఎస్‌ఎస్ విద్యాపీఠ గన్‌హౌస్ నుంచి కోటె ఆంజనేయస్వామి ఆలయం దాకా ర్యాలీ నిర్వహించనున్నారు. రాష్ట్ర సురక్షా జనాందోళన సమితి నిరసనకు పిలుపునిచ్చింది. బీజేపీ అనుబంధ హిందూసంఘాల సభ్యులంతా పాల్గొననున్నారు. దీంతో మైసూరు జిల్లా పోలీస్ కమిషనర్ ఆదివారం ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష జరిపారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే నగరంలో 144 సెక్షన్ జారీ చేశారు. సభలు, సమావేశాలకు నిషేధాజ్ఞలు విధిస్తున్నట్టు నగర కమిషనర్ సీమాలాఠ్కర్ ప్రకటించారు.

సంతానలేమిని ముందుగా గుర్తిస్తే తగిన వైద్యం

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దేశంలో సంతానలేమి సమస్యలు పెరుగుతున్నాయని, ప్రారంభంలోనే అటువంటి దంపతులు గుర్తిస్తే తగిన చికిత్సలు అందించేందుకు వీలుంటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. గ్లోబల్ హెల్త్ అకాడమీ ఆధ్వర్యంలో కాంప్రిహెన్సివ్ ఇన్‌ఫర్టిలిటీ కాంక్లేవ్-2025 నగరంలో ఆదివారం జరిగింది. దేశంలోని వివిధప్రాంతాలకు చెందిన గైనకాలజీ నిపుణులు భాగస్వాములయ్యారు. హెచ్‌సీజీ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ బీఎస్ అజయ్‌కుమార్, డాక్టర్ ప్రవీణ్‌జోషి, డాక్టర్ మేఘనా న్యాపతి, డాక్టర్ అంజలి అజయకుమార్ సదస్సును పర్యవేక్షించారు. నిపుణుల అభిప్రాయం మేరకు 50శాతం మందిలో సంతానలేమి తీవ్రమైన పరిణామాలకు కారణం అవుతోందన్నారు. కుటుంబాలలో పెను సమస్యలు తలెత్తనున్నాయన్నారు. సంతానలేమికి ఎప్పటికప్పుడు చికిత్సలు చేయించుకోవాలన్నారు. అధునాతన వైద్యవిధానాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇండియా ఐటీ హబ్‌గా ఉన్న బెంగళూరులో ఎక్కువ సమయంపాటు కూర్చోవడం, కంప్యూటర్‌లు చూడడం వల్ల సంతానలేమికి కారణమవుతోందన్నారు. సదస్సు అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్‌జోషి మాట్లాడుతూ నగర ప్రదేశాలలోనే సంతానలేమి సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. ఇటీవలి అధ్యయనాల ప్రకారం 40-50 శాతం పురుషులకు సంబంధించినవే ఉన్నాయన్నారు. వీర్యకణాలు తక్కువగా ఉండడం, హార్మోన్ల సమతుల్యత లోపించడం, వంశపారంపర్య సమస్యలు, ధూమపానం, మద్యపానం, స్థూలకాయం వంటి సమస్యలు సంతానలేమికి కారణాలుగా ఉన్నాయన్నారు. ప్రతి వెయ్యిమంది మహిళల్లో 18.7శాతం సంతానలేమి సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. పెళ్లైన ఐదేళ్ల వరకు ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారన్నారు. జీవనశైలిలో మార్పు, అనుభవం ఉన్న వైద్య నిపుణుల అభిప్రాయాలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు



సదస్సు వేదికపై వైద్యబృందం

కాంగ్రెస్ కార్యకర్త

దారుణ హత్య



హైదర్ అలి (ఫైల్)

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్ ప్రాంతం గరుడా మాల్ సమీపాన శనివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త, శాంతినగర్ ఎమ్మెల్యే హ్యారిస్ అనుచరుడిగా గుర్తింపు పొందిన హైదర్ అలి (37)ను ప్రత్యర్థులు దారుణంగా హత్యచేశారు. లైవ్‌బ్యాండ్ కార్యక్రమాన్ని ముగించుకుని స్నేహితుడితో కలసి కారులో శనివారం అర్ధరాత్రి ఇంటికి వెళ్తుండగా బైక్‌లలో వెంబడించిన దుండగులు మారణాయుధాలతో దాడి చేశారు. రోడ్డుపక్కనే అతడు పడిపోవడంతో వదిలివెళ్లారు. విషయం తెలిసిన వెంటనే అశోక్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయాలతో ఉన్న హైదర్‌అలిని బౌరింగ్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలియగానే హైదర్‌అలి ఆప్తులు, బంధువులు మారణాయుధాలతో బౌరింగ్ ఆసుపత్రితోపాటు సంఘటన జరిగిన ప్రాంతాలలో సంచరించినట్టు తెలుస్తోంది. కాగా హైదర్‌అలితోపాటు ద్విచక్రవాహనంపై ఉన్న అతడి మిత్రుడికి కూడా గాయాలయ్యాయి. హైదర్‌అలిపై 11 కేసులు ఉన్నాయని, 2014 నుంచి ఇతడు పలు దాడులతోపాటు నేరాలలో భాగస్వామ్యం ఉన్నట్టు సెంట్రల్ విభాగం డీసీపీ శేఖర్ హెచ్‌టీ తెలిపారు.

హంపిలో విదేశీ పర్యాటకుల సందడి

ఉత్సవాలకు ముస్తాబవుతున్న విజయవిఠల దేవస్థానం

హోస్పేట (విజయనగరం), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): హంపిలో ఆదివారం విదేశీ పర్యాటకుల సందడి నెలకొంది. విజయనగరం జిల్లా హోస్పేట సమీపంలో ఉన్న హంపిలో 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరగనున్న హంపి ఉత్సవాలకు అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. హంపి విరుపాక్షి దేవస్థానం అక్కబుక్క రాజుల సామ్రాజ్య పాలనలో విరూపాక్షేశ్వరస్వామి ఆలయం శ్రీకృష్ణదేవరాయల హయాంలో పేరు ప్రఖ్యాతిగాంచిన హంపి, హానెగుంది, విజయ విఠల దేవస్థానం, ఏనుగుల ప్యాలెస్, విరూపాక్షి దేవస్థానం, గణేష్ దేవాలయం, తుంగభద్ర డ్యామ్, విఠల దేవస్థానం, ఆచార్య దేవస్థానం, లోటస్ ప్యాలెస్, హనుమాన్ ఆలయం, ఉగ్ర నరసింహ ఆలయం, స్టెప్ ట్యాంకు ఆలయం, దసరా ఆలయం, బాలకృష్ణ ఆలయం, జనం ఎంక్లోస్లీ టెంపుల్, అంజారాం టెంపుల్ తదితర ప్రాంతాలను వీక్షించేందుకు పెద్దఎత్తున దేశాల నుంచి విదేశీయులు పెద్దఎత్తున తరలివస్తున్నారు.



రాతి రథం వద్ద విదేశీయుల సందడి



ఏనుగుల ప్యాలెస్



ప్రత్యేక అలంకరణలో విరూపాక్షేశ్వరాలయం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1609.45	1,587.45
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,063	763
నీటి నిల్వ (టీఎంసీలు)	36.51	9.03

నెహ్రూ పార్కు పరిశుభ్రం



పార్కును శుభ్రపరుస్తున్న నగర వాసులు

గంగావతి, రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూపార్కును పర్యావరణ ప్రేమికులు ఆదివారం శుభ్రం చేశారు. గంగావతి బెక్కింగ్ గ్రూప్, రోటరీక్లబ్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అసోసియేషన్, కన్నడ సాహిత్యపరిషత్తు సభ్యులు పాల్గొని పార్కును శుభ్రపరిచారు. డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న జనాభా కోసం నగరంలో ఒకేఒక పార్క్ ఉందని తెలిపారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరిందన్నారు. ఇక్కడ రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఎక్కడచూసినా మద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ బ్యాగులు, చెత్త చెదారంతో నిండిపోయిందన్నారు. పార్కు నిర్వహణ కోసం సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. శివరాత్రి పండుగ సందర్భంగా పార్కును అందంగా ఉంచేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

డైరెక్టర్ ఎన్నికల్లో కేశవరెడ్డి వర్గం జయభేరి



పీఎల్‌డీ బ్యాంకు వద్ద గుమిగూడిన సభ్యులు

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలోని అనంతపురం రోడ్డు ఫుట్‌బాల్ సభ ప్రాంగణంలో ఆదివారం పీఎల్‌డీ డైరెక్టర్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో 12 మంది బరిలో నిలవగా ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐదుగురు కాంగ్రెస్ అభ్యర్థులు గెలవగా నలుగురు బీజేపీ అభ్యర్థులు గెలిచారు. ఈ ముగ్గురు ఏ వర్గానికి మద్దతు తెలుపుతారో ఆ వర్గం వారు పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు అయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. కేశవరెడ్డి, బీజేపీ నాయకులు మురళి గౌడ, ఏపీఎంసీ మాజీ అధ్యక్షులు సిద్దరగడ్డ బసలింగనగౌడ పలు గ్రామాల ఓటర్లు పాల్గొన్నారు.

వీధికుక్కలతో జనం పాట్లు..!



కురుగోడు ప్రధాన వీధుల్లో తిరుగుతున్న కుక్కలు

కంప్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణాలు, గ్రామాల్లో వీధికుక్కల వల్ల బయటకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. రాత్రి వేళల్లో వీధి కుక్కల వల్ల ఎంతో మంది గాయపడ్డారు. వీటి నుంచి విముక్తి కలిగించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. మూడు రోజుల క్రితమే విద్యార్థులపై దాడిచేసి గాయపరచిన విషయం తెలిసిందే. కంప్లి, కురుగోడు, కుడితిని పట్టణాల్లో తరచూ కుక్కల వల్ల ప్రజలు ఇబ్బందులుపడి ఆస్పత్రి పాలవుతున్నారు. పురసభ అధికారులు వీధి కుక్కల నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు

పెరిగిన భూగర్భ జలాలు.. తీరనున్న సమస్య

బళ్లారి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే నీటి కష్టాలు మొదలవుతాయి. ప్రజలు తాగునీరు కోసం ఇబ్బంది పడకుండా ఈసారి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయి. బావులు, బోర్లు, ట్యాంకులు, నదులు, చెరువులు ఇలా అన్నీ నీటివనరులు నిండినాయి. ప్రస్తుత వేసవిలో చిన్నచిన్న సమస్యలు తలెత్తినా అధికారులు పరిష్కరించేందుకు సిద్ధమవుతున్నారు. బళ్లారి జిల్లాలో 5 శాసనసభ నియోజకవర్గాలున్నాయి. 289 గ్రామ పంచాయితీలుండగా ఈ ఏడాది 71 గ్రామాల్లో తాగునీరు ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నట్లు అధికార యంత్రాంగం గుర్తించింది. వీటిని ఎలా పరిష్కరించాలి అనే అంశంపై పరిశోధించింది. బళ్లారి గ్రామీణంలో 14 సండూరు-20, సిరుగుప్ప-11. కంప్లి 14, మొత్తం 71 గ్రామాల్లో తాగునీరు ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నట్లు గుర్తించారు. గత ఏడాది వేసవిలో 125 గ్రామాలకు పైగా తాగునీటి సమస్యను ఎదుర్కొన్నాయి. ఈ ఏడాది వర్షాలు బాగా కురవడంతో చాలా వరకు గ్రామాల్లో నీరు పుష్కలంగా అందుతున్నాయని యంత్రాంగం పేర్కొంది.



తోపుడు బండిపై నీటిని తెచ్చుకుంటున్న దృశ్యం (ఫైల్)

తాగునీటి కొరత రానివ్వద్దు..
- డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా



జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత లేకుండా అధికారులు పర్యవేక్షించాలి. వర్షాలు బాగా కురిశాయి, భూగర్భ జలాలు పెరిగాయి. జలప్రాజెక్టుల ద్వారా ప్రజలకు తాగునీరు పుష్కలంగా అందుతున్నాయి. వేసవిలో చిన్నచిన్న సమస్యలు రాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకున్నాం. అడవుల్లో జంతువులు, ఇతర వన్యప్రాణులు తాగునీటి కోసం అటవీశాఖతో చర్చించి కావాల్సిన చర్యలు చేపడతాం. ఎక్కడైనా తాగునీటి సమస్య తెలిత్తితే వెంటనే పరిష్కరిస్తాం.

విమ్స్‌లో చిన్నారి మృతి

- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని తల్లిదండ్రుల ఆరోపణ
- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బళ్లారి మెడికల్ కాలేజ్ అండ్ రీసెర్ఛ్ సెంటర్(వీఎంసీఆర్‌సీ-విమ్స్)లో చికిత్స కోసం చేరిన ఓ చిన్నారి శనివారం మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే చిన్నారి మృతిచెందినట్లు తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు ఆసుపత్రి ముందు నిరసన తెలిపారు. 13 నెలల స్వాతి విరేచనాలతో మొదట నగరంలోని ఒక ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించినట్లు సమాచారం, అక్కడి వైద్యులు చివరికి విమ్స్ ఆసుపత్రికి పంపారు. రెండు రోజులుగా బిమ్స్‌లో చికిత్స పొందుతున్నప్పటికీ చిన్నారి మృత్యువాతపడింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే చిన్నారి మృతిచెందిందని ఆరోపిస్తూ తల్లిదండ్రులు శనివారం విమ్స్ బయట నిరసన తెలిపారు. కొంతమంది ప్రజా సంఘాల నాయకులు వారికి మద్దతు ఇచ్చారు. ఘటనస్థలానికి చేరుకున్న విమ్స్ డైరెక్టర్ గంగాధర్‌గౌడ చిన్నారికి పోస్టుమార్టం నిర్వహించి నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే తల్లిదండ్రులు అంగీకరించలేదు. పోలీసులు, వైద్య అధికారులతో జరిగిన చర్చల తర్వాత తల్లిదండ్రులు నిరసనను విరమించారు. విమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ ఆ బిడ్డ జీవక్రియలో హెచ్చుతగ్గులు ఉన్నాయని, దీని ఫలితంగా మృతిచెందిందన్నారు. మేము ఈ కేసును తీవ్రంగా పరిగణించామని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



ఆసుపత్రి ముందు చిన్నారి మృతదేహంతో నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నాయకులు

నవోదయాలో గ్రూప్-బీ అభ్యర్థుల అవస్థలు

రాయచూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నవోదయా టెక్నికల్ డిగ్రీ కళాశాలలో ఆదివారం గ్రూప్-బీ కేపీఎస్‌సీ పరీక్ష రాసేందుకొచ్చిన అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పరీక్ష హాళ్లలో ఫ్యాన్‌లు లేకపోవడంతో ఉక్కపోతకు అల్లాడిపోయినట్లు వారు వాపోయారు. ఫేస్ రికగ్నిషన్ పేరుతో మూడంతస్థులపై ఉన్న అభ్యర్థులను పదేపదే కిందికి పిలవడం వల్ల అరగంటకుపైగా సమయం కోల్పోవాల్సి వచ్చిందని, పరీక్షపత్రం గడువుకంటే 10 నిమిషాలు ఆలస్యంగా అందజేయడం వల్ల అసౌకర్యానికి గురైనట్లు అభ్యర్థులు తెలిపారు. కాగా పరీక్ష రాసి వచ్చిన అభ్యర్థులు కొందరు అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇలాంటి సౌకర్యాలు లేని కళాశాలలను సెంటర్‌లుగా ఎందుకు ఏర్పాటు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



అధికారులతో వాగ్వాదానికి దిగిన అభ్యర్థులు

మాంసం మార్కెట్ తనిఖీ



మాంసం మార్కెట్‌ను పరిశీలిస్తున్న పశువైద్యులు

కంప్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం పశువైద్యులు కట్టెమని శివప్ప మాంసం మార్కెట్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మృతిచెందిన గొర్రెలు, మేకల అమ్మకాలు చేపడుతున్నారని, పరిశుభ్రంగా వుంచుకోవడం లేదని, వైరస్‌సోకిన వాటిని విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో పరిశీలించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ చికెన్, మటన్ షాపులు పరిశుభ్రంగా వుంచుకుని కల్తీలేని మాంసాన్ని విక్రయించాలని సూచించామన్నారు. వేసవి ప్రారంభమైందని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిషాపును తనిఖీ చేశారు.

సంప్రదాయాలను మరవద్దు

చిక్కినకొప్ప శివశరణుస్వాములు

కంప్లి, ఫిబ్రవరి 23(ఆంధ్ర జ్యోతి): మోబైళ్లు, కంప్యూటర్లు, వాట్సాప్‌ల మోజులో పడి దేశ సంప్రదాయాలను మరవద్దని చిక్కినకొప్ప శివశరణుస్వాములు అన్నారు. ఆదివారం సన్నాపురం గ్రామంలో వీరభద్రేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా, 48వ కలబురిగి శరణు బసవేశ్వర పురాణ కార్యక్రమంలో స్వామికి తులాభారం చేశారు. శివశరణు స్వాములు మాట్లాడుతూ తులాభారం ద్వారా వచ్చిన డబ్బును మఠం అభివృద్ధికి, అన్నసంతర్పణకు ఉపయోగిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇలా ధార్మిక కార్యక్రమాలు చేపట్టి శాంతి, అభివృద్ధి నెలకొనేందుకు ముందుకు రావాలని సూచించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మూకయ్యస్వామి మాట్లాడుతూ చిక్కినకొప్ప శివశరణు స్వాముల తులాభారం, పూజలు, కార్యక్రమాలు గ్రామంలో ఒక పండుగలా నిర్వహించుకుంటామని తెలిపారు. మార్చి 9న జరిగే వీరభద్రేశ్వరస్వామి రథోత్సవంలో శరణు బసవేశ్వర పురాణ పఠనం, ప్రతినిత్యం వీరభద్రేశ్వరాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే జేఎన్ గణేష్ సతీమణి శ్రీదేవి, రేణుకగౌడ, ఈశప్ప, శరణప్ప, కుమారస్వామి, శరణప్ప, బసవరాజు, ఆలయ కమిటీ ప్రముఖులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



చిక్కినకొప్ప శివశరణుస్వామికి తులాభారం చేస్తున్న భక్తులు

1 నుంచి పీయూసీ పరీక్షలు

అవకతవకలకు పాల్పడితే చర్యలు: డీసీ



మాట్లాడుతున్న విజయనగరం కలెక్టర్ దివాకర్

బళ్లారి సిటీ ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ద్వితీయ పీయూసీ పరీక్షలు మార్చి 1 నుంచి 20 వరకు జరుగుతాయని, అధికారులు ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా విధులు నిర్వర్తించాలని విజయనగర జిల్లాకలెక్టర్ ఎం.దివాకర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ హాల్లో జరిగిన వార్షిక పరీక్షల సన్నాహక సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం తప్పనిసరి చేశామని అన్నారు. పరీక్షా కేంద్రం అధిపతి తప్ప మిగిలినవారు మొబైల్ ఫోన్లు వాడటం నిషేధమన్నారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, జవాబు పత్రాల కస్టోడియన్లు, ఆఫీస్ సూపరింటెండెంట్లు, సామగ్రి రవాణాచేసే రూట్ అధికారులు జాగ్రత్తగా ఉండాలని, ప్రశ్నపత్రాలు తీసుకునే మార్గంలో భారీ పోలీసు బలగాలను మోహరించాలని ఆదేశించారు. ప్రశ్నపత్రాల లీకేజీలపై సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం ఉండకుండా చూసుకోవాలని జెస్కాం అధికారులను ఆదేశించారు. ప్రీ-యూనివర్సిటీ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజ్ హవల్దార్ మాట్లాడుతూ మార్చి 1 మార్చి 20వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లాలోని అన్ని పరీక్షాకేంద్రాల సూపరింటెండెంట్లు, సమాధాన పత్రాల కస్టోడియన్లు, కార్యాలయ సూపరింటెండెంట్లు, గోప్య సామగ్రి రవాణా చేసే రూట్ అధికారులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జీవితం.. సుఖశాంతులతో సాగాలి



వధూవరులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న కొల్లి శ్రీనివాసరావు

సిరుగుప్ప, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వధూవరులు వందేళ్లపాటు పండంటి జీవితాన్ని సుఖశాంతులతో సాగాలని పీయూజీ ఫౌండర్, చైర్మన్ కొల్లి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఆదివారం తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో జ్ఞానలింగేశ్వరాలయంలో ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగానే గొట్టిపాటి ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా 52 జంటలకు తాళిబొట్లను అందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొల్లి శ్రీనివాసరావు వధూవరులకు తాళిబొట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ నేటి రోజుల్లో నిరుపేదలు వివాహాలు చేసుకోవాలంటే ఎంతో శ్రమించాల్సి ఉంటుందన్నారు. ఉచిత సామూహిక వివాహాల వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. టెక్కలకోట పట్టణ పంచాయతీ అధ్యక్షుడు ఆనంద్, కాంగ్రెస్ నాయకులు నరేంద్ర సింహ, జ్ఞానలింగేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షులు, పదాధికారులు, సభ్యులు, కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

గాలిమర దగ్ధం



కాలిపోతున్న గాలిమర

కంప్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా హిరాళ్ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం గాలిమర దగ్ధమైంది. ప్రజల అప్రమత్తతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. వీరేష్, కుమారస్వామి రామాంజినేయ పొలాల్లో గాలిమరలు ఏర్పాటు చేసేందుకు ప్రైవేటు సంస్థ వారు సిద్ధం చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఉన్నఫళంగా గాలిమర రెక్కల వద్ద పెద్దగా మంటలు చెలరేగి గాలిమర కాలి బూడిదైంది. ఆ సమయంలో కూలీలు, సంస్థ ఉద్యోగులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. యంత్రంలో లోపంవల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని సంస్థ అధికారులు తెలిపారు.

ఆరబెట్టిన పొగాకు..



అగ్నికి ఆహుతైన పొగాకును పరిశీలిస్తున్న అధికారులు, గ్రామస్థులు

రాయచూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వై మల్లాపూర్ గ్రామ శివారులో ఆరబెట్టిన పొగాకు పంటకు నిప్పంటుకుని లక్షల్లో ఆస్తి నష్టం జరిగింది. ఆదివారం గ్రామస్థులు పంట యజమాని రెవెన్యూ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. రోడ్డు సమీపంలోనే పొగాకును ఆరబెట్టడం వల్లే దారి గుండా వెళ్లేవారెవరో సిగరెట్ విసరివేయడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. నాలుగు ఎకరాల్లో వేసిన పంటపూర్తిగా కాలిపోవడంతో లక్షల్లో నష్టం ఉంటుందని, రైతును ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే మేనల్లుడి మృతి



దీపుగౌడ(ఫైల్)

రాయచూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధూరు శాసనసభ్యుడు బాదర్లి హంపనగౌడ సోదరి కుమారుడు దీపుగౌడు(50) రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతిచెందాడు. మంగళూరులో తన పిల్లలను హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్న దీపుగౌడ ఆదివారం సెలవు కావడంతో వారిని పలకరించేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. పిల్లలు ఉండే హాస్టల్ సమీపంలో కారు ఆపి తన మిత్రులతో కలిసి రోడ్డుపై వెళుతున్న వెనక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. దీపుగౌడ అక్కడికక్కడే మృతి చెందగా ఆయనతో పాటు వెళ్లిన స్నేహితులు గంగావతి రఘునాథ్, కారటగి ప్రదీప్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం మంగళూరు ఆస్పత్రికి తరలించారు. దీపుగౌడ మృతదేహాన్ని సింధనూరుకు తీసుకొచ్చారు.

హోసూరు జోన్

అదనపు సర్వీసులు నడపండి

హోసూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): హోసూరులోని జాతీయ రహదారిపై బస్సు కోసం గంటలతరబడి వేచియుండాల్సి ఉంటోందని మరిన్ని సర్వీసులు నడపాలని ప్రయాణీకులు కోరుతున్నారు. బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిపై కృష్ణగిరి జిల్లా హోసూరు ముత్తుమారియమ్మ ఆలయం మూకొండపల్లి, సిప్‌కాట్, పాఠశాల విద్యార్థులు, పేరండపల్లి పాఠశాల, కుముదేపల్లి, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో బస్సుల కోసం చాలాసేపు వేచిఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా రెండో సిప్‌కాట్ ప్రాంతాలలో వేలాది మంది ప్రయాణీకులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వీస్ రోడ్డులో అదనపు సిటీ బస్సులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జూజూవాడి, ఎంఎం నగర్ ఎదురుగా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సీతారామయ్య మేడు ప్రాంతాల్లో ఫ్లై ఓవర్‌లు నిర్మించాల్సిన అవసరం ఉంది.



బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

డీఎంకే కార్యవర్గ సమావేశం

హోసూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమ జిల్లా డీఎంకే అత్యవసర కార్యవర్గ సమావేశం జిల్లా కౌన్సిల్ అధ్యక్షుడు యువరాజ్ అధ్యక్షతన జరిగింది. హోసూరు తళి రోడ్డులోని ఆనంద్ ప్యాలెస్ కల్యాణ మంటపంల్లో సమావేశం జరిగింది. సమావేశానికి పౌర ఆహార సరఫరాల శాఖమంత్రి చక్రపాణి, ఎమ్మెల్యే వై.ప్రకాశ్ హజరై ప్రత్యేక ప్రసంగం చేశారు. కార్యవర్గ సమావేశంలో మార్చి 1 డీఎంకే ముఖ్యమంత్రి జన్మదినోత్సవం, యువజన సంక్షేమ సహాయం పంపిణీ, బహిరంగ సభలు నిర్వహణ, మార్చి నెలంతా డీఎంకే సృజనాత్మక కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో మేయర్ సత్య, ఉప కార్యదర్శులు మురుగన్, పుష్ప సర్వేశ్, కోశాధికారి సుకుమారన్, ముఖ్యకార్యవర్గ సభ్యులు ఎల్లోరమణి, వీరారెడ్డి, జ్ఞానశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే, నాయకులు

98 దుకాణాలకు టెండర్లు

హోసూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కాళికాంబ గోమటేశ్వర ఆలయానికి చెందిన 98 దుకాణాలకు టెండరు పిలిచారు. తేరుపేటలోని చంద్ర చూడేశ్వర ఆలయంలో డిప్యూటీ కమిషనర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 59 దుకాణాలకు గాను 137 మంది టెండర్లు వేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ వెంకటరాజ్ సమక్షంలో టెండర్లను పరిశీలించారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి చిన్నస్వామి మాట్లాడుతూ.. అత్యధికంగా రూ.25,700 టెండరును కోట్ చేశారన్నారు. టెండర్ వెరిఫికేషన్‌లో ఆలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చిన్నస్వామి, ఇన్‌స్పెక్టర్లు శక్తి రామమూర్తి, పూవరసన్, వేల్‌రాజు, ఆలయ ధర్మకర్తలు వెంకటబాబు, ఎం.మునిరత్నం సుబ్రహ్మణి, శివకుమార్, మురళి పాల్గొన్నారు. కాగా 39 దుకాణాలకు ఎవరూ టెండరు వేయలేదని అధికారులు తెలిపారు.



టెండరులో పాల్గొన్న అధికారులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

పిలకా గణపతి శాస్త్రి (జయంతి)




ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పిలకా గణపతి శాస్త్రి 1911 ఫిబ్రవరి 24న తూర్పుగోదావరి జిల్లా కట్టుంగ గ్రామంలో జన్మించారు. కవి, వ్యాఖ్యాత, నవలా రచయిత, అనువాదకుడు, ఆర్ష విద్వాంసులు, పత్రికా సంపాదకులుగా రాణించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రాజమహేంద్రవరం ఆంధ్ర యువ తీ సంస్కృత పాఠశాలలోనూ, వీరేశలింగం పాఠశాలలోనూ తెలుగు పండితులుగా పనిచేశారు. ఆంధ్ర శిల్పి, ఆంధ్రప్రభ తదితర పత్రికలకు సహాయ సంపాదకు లుగా వ్యవహరించారు. 1983 జనవరి 2న కన్నుమూశారు.

తలత్ మహమూద్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత తలత్ మహమూద్ 1924 ఫిబ్రవరి 24న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవ్‌లో జన్మించారు. సినీ నేపథ్య గాయకుడు, గజల్ ఆలాపనలో పేరొందారు. 1940 నుంచి 1980 వరకు 12 భాషలలో 750 పాటలు పాడారు. అంతేకాక 12కుపైగా సినిమాలలో నటించారు. తూర్పు ఆఫ్రికా, యునైటెడ్ స్టేట్స్, యూకే, వెస్ట్ ఇండీస్ తదితర దేశాలలో పర్యటించిన తొలి భారత గాయకుడు. లండన్‌లోని రాయల్ అల్బర్ట్ హాల్‌లోనూ ప్రదర్శన ఇచ్చారు. 1998 మే 9న కన్నుమూశారు.

డాక్టర్ ఎస్ఎస్ బద్రీనాథ్ (జయంతి)



దేశంలో పేరొందిన కంటి ఆసుపత్రి శంకర నేత్రాలయ సంస్థాపకులు, ఛైర్మన్, 'పద్మభూషణ్' గ్రహీత సెంగమేడు శ్రీనివాస బద్రీనాథ్ 1940 ఫిబ్రవరి 24న చెన్నైలో జన్మించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోనూ క్రియాశీలకంగా వ్యవహరించారు. మానవతా దృక్పథంతో పలు వైద్య పరిశోధనలు చేశారు. ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య సేవలు, ఆప్తల్మాలజీలో గ్రాడ్యుయేట్‌లకు శిక్షణ ఇస్తున్నారు. 2023 నవంబరు 21న కన్నుమూశారు.

జయలలిత (జయంతి)



తమిళనాట అభిమానులచే అమ్మ, 'పురచ్చి తలైవి' (విప్లవ నాయకురాలు) గా పేరొందిన జయరాం జయలలిత 1948 ఫిబ్రవరి 24న మైసూరు ప్రాంతంలో జన్మించారు. సినీ నటిగా, రాజకీయాల్లోనూ రాణించారు. 1991 నుంచి 2016 వరకు తమిళనాడు ముఖ్యమంత్రిగా కొనసాగారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 140 సినిమాలలో నటించారు. తమిళ చిత్రసీమలో మకుటంలేని మహారాణిగా నిలిచారు. అనంతరం రాజకీయాల్లో రాణించి ఏఐఏడీఎంకే పార్టీ జనరల్ సెక్రటరీగా వ్యవహరించారు. అనారోగ్యంతో 2016 డిసెంబరు 5న కన్నుమూశారు.

స్టీవ్ జాబ్స్ (జయంతి)



ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ యాపిల్ సంస్థ సహ సంస్థాపకులు, ఛైర్మన్ అండ్ సీఈఓ అయిన స్టీవ్‌జాబ్స్ 1955 ఫిబ్రవరి 24న అమెరికా దేశం కాలిఫోర్నియాలో జన్మించారు. వ్యాపారవేత్త, పెట్టుబడిదారుడు. పర్సనల్ కంప్యూటర్‌ను ప్రజలందరికీ చేరువ చేయడంలో కీలకంగా వ్యవహరించారు. ఐమ్యాక్, ఐట్యూన్స్, ఐపాడ్, ఐఫోన్, యాప్ స్టోర్‌లను అభివృద్ధి చేశారు. నేషనల్ మెడల్ ఆఫ్ టెక్నాలజీ తదితర పురస్కారాలు పొందారు. 2011 అక్టోబరు 5న కన్నుమూశారు.

ముళ్లపూడి వెంకటరమణ (వర్ధంతి)



ముళ్ళపూడి వెంకటరమణ 1931 జూన్ 28న ధవళేశ్వరంలో జన్మించారు. తెలుగు రచయిత. నవలలు, కథలు, సినిమా కథలు, హాస్యకథలు రాశారు. ప్రధానంగా హాస్యరచనలతో పేరొందారు. తెలుగు సాహిత్యంలో 'బుడుగు' ఎంతో పేరొందింది. ఆయన రచనలకు ప్రఖ్యాత చిత్రకారుడు బాపు సహకారం అందించారు. బాపు సినిమాలకు రమణ రచనలు చేసి 'బాపు-రమణ' జంటగా పేరొందారు. ఆయన ఆత్మకథ 'కోతికొమ్మచ్చి' పుస్తకరూపంలో వెలువడింది. రాజాలక్ష్మీ సాహిత్య పురస్కారం పొందారు. 2011 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

సంజయ్‌లీలా భన్సాలీ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత సంజయ్‌లీలా భన్సాలీ 1963 ఫిబ్రవరి 24న ముంబైలో జన్మించారు. బాలీవుడ్‌లో దర్శకుడు, నిర్మాత, స్క్రీన్ రైటర్, సంగీత దర్శకుడిగా రాణించి బహుముఖ ప్రజ్ఞా శాలిగా పేరొందారు. 7 జాతీయ, 12 ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు పొందారు. 2002లో రూపొందించిన దేవదాస్ సినిమా బాఫ్టాకు నామినేట్ అయింది. పలుమార్లు ఉత్తమదర్శకుడి పురస్కారం అందుకున్నారు.

నాని (పుట్టినరోజు)



నానిగా సుపరిచితులైన నేచురల్ స్టార్, తెలుగు నటుడు నవీన్ బాబు ఘంటా 1984 ఫిబ్రవరి 24న కృష్ణా జిల్లా చల్లపల్లిలో జన్మించారు. సినిమాలకు సహాయ దర్శకుడిగా, కొంతకాలం రేడియో జాకీగా కూడా పనిచేశారు. వాణిజ్య ప్రకటనల తర్వాత అష్టాచమ్మా అనే తెలుగు సినిమాలో నటించారు. ఆ తర్వాత పలు సినిమాలలో అవకాశం లభించింది. నిర్మాతగా కూడా విజయం సాధించారు. 2 నంది పురస్కారాలు, 3 ఫిలింఫేర్ అవార్డులు, 4 సైమా అవార్డులు అందుకున్నారు.

ముస్తాబవుతున్న శివాలయం

బుక్కపట్నం, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన శివాలయంలో శివరాత్రి సందర్భంగా ఈనెల 25 నుంచి 27 వరకు ద్వాదశ జ్యోతిలింగాల దర్శనానికి నమూనాలను ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్వాహకులు గోపి మాట్లాడుతూ 26న కైలాసగిరి దర్శనం, 27న లక్షదీపోత్సవం నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

అభివృద్ధికి ఆలయాల ఎదురుచూపు..!

» తాలూకాలో ఎన్నో పురాతన ఆలయాలు



జడల భైరవేశ్వర ఆలయం

బాగేపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని పలు పురాతన ఆలయాలు అభివృద్ధికి ఎదురుచూస్తున్నాయి. చోళుల, పాళేగాళ్ల కాలంలో రాజు, మహారాజుల కాలంలో మహాశివరాత్రి వంటి పర్వదినాలలో విశేష పూజా కార్యక్రమాలు కొనసాగిన ఆలయాలు ఉన్నాయి. వీటిలో పట్టణ శివారులో చిత్రావతి నది సమీపానగల జడల భైరవేశ్వర ఆలయం, పరగూడు పంచలింగేశ్వర ఆలయం, పాతపాళ్యలోని హిరణ్యేశ్వర ఆలయాలలో నిత్యకైంకర్యాలు జరుగుతున్నప్పటికీ మరింత అభివృద్ధి ఎప్పుడెప్పుడా అనేలా ఉన్నాయి. సుమారు 560 ఏళ్ల పాటు గుమ్మనాయకనపాళ్యలో కోట ప్రాంతంలో పాలెగాళ్ల వంశస్తులు 25 తరాల వారు పాలన సాగించారు. విజయనగర చక్రవర్తులకు మిత్రులుగా, మరాఠా పేష్వాలకు మిత్రులుగా ఉంటూ హైదరాబాద్ నవాబ్‌ల ఆగడాలను ఎదుర్కొన్నారని చరిత్రద్వారా తెలుస్తోంది. పాలెగాళ్ల వంశస్తులు గమ్మనాయకపాళ్య కోటను తాలూకా కేంద్రంగా చేసుకున్నట్టు తెలుస్తోంది. అప్పట్లో చిత్రావతి నది సమీపాన జడల భైరవేశ్వర, పంచలింగేశ్వర, పాతపాళ్య సమీపాన గుట్టమీద పల్లి వద్ద హిరణ్యేశ్వర ఆలయాలను నిర్మించారు. నిత్యపూజలతోపాటు ఏటా పండుగలు, పర్వదినాలవేళ వేడుకలు సాగుతాయి. ఇక్కడి శిలాశాసనాలు ద్వారా ఎన్నో ఒక్కో ఆలయానికి ఉన్న చరిత్ర తెలుస్తోంది.

జడల భైరవేశ్వర ఆలయం

పట్టణ శివారులో చిత్రావతి నదీ తీరాన పురాతన జడల భైరవేశ్వర ఆలయం ఉంది. పొరుగు ఉన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం పులివెందుల పట్టణానికి 23 కిలోమీటర్ల ఉన్న నల్లచెరువుపల్లి గ్రామంలోని మోపూరి భైరవేశ్వర ఆలయానికి, చిత్రావతి సమీపానగల జడల భైరవేశ్వర ఆలయానికి పోలిక ఉంది. రెండుచోట్ల శివుడి ఉద్భవ లింగాలు ఉన్నాయి. ఇక్కడ లభించిన శాసనాలలోనూ సామీప్యం ఉంది. అక్కడ మోపూరి భైరవేశ్వర, ఇక్కడ జడల భైరవేశ్వర ఆలయాలుగా పేరొందాయి. ఇక్కడి ఆలయానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి.

హిరణ్యేశ్వర ఆలయం

తాలూకాలోని చారిత్రాత్మక స్థలమైన గుమ్మనాయకపాళ్యలో 108 దేవాలయాలపైకి హిరణ్యేశ్వర ఆలయం ఒకటి. బాగేపల్లి నుంచి పాత పాళ్యకు వెళ్లే మార్గంలో భైరవ పట్టణం - రామగిరి ప్రాంతాలకు అనుబంధంగా ఆలయం ఉంది. విజయనగర సంస్థానంలో హక్కబుక్కరాయలు పాలన వేళ 1343లో సేనాపతి హిరణ్ణయ్య, హక్కబుక్కల కుమారుడు కెంపణ్ణ రాయలు తమ సైన్యంతో యుద్ధానికి వెళ్తున్న వేళ ఇద్దరిమధ్యా బేధాభిప్రాయాలు తలెత్తాయి. ఆ తరుణంలో ఆలయంలో బస చేసి పూజలు చేశారు. ఇందుకు సంబంధించి హక్కబుక్కరాయలు, హిరణ్ణయ్య విగ్రహాలను నేటికీ ఇక్కడ వీక్షించవచ్చు. ఇంతటి ఆలయాలు అభివృద్ధి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు కోరుతున్నారు.

పరగోడు పంచలింగ దేవాలయం

పరగోడులోని పంచలింగ దేవాలయం ఎంతో ప్రాచీనమైనది. 12 శతాబ్దాలక్రితం చోళుల వంశానికి చెందిన కులోత్తుంగ అనే రాజు ఈ ఆలయాన్ని ఏర్పాటు చేసినట్టు శాసనాల ద్వారా తెలుస్తోంది. గర్భగుడి ఎడమవైపు పశ్చిమ లింగాన్ని ధర్మేశ్వరుడిగా ప్రస్తావించారు. ధర్మేశ్వరుడు భీమేశ్వరుడికంటే విగ్రహం చిన్నదిగా ఉంటుంది. ఈ రెండు లింగాలు చిక్క బళ్ళాపుర నంది గ్రామంలోని భోగ నందీశ్వర, కోలారు సోమేశ్వర లింగాలకంటే పెద్దవిగా ఉన్నాయి. రాజు, మహారాజుల కాలంలో నిర్మించిన పురాతన ఆలయాలకు వందలాది ఎకరాలు మాన్యంగా ఉన్నప్పటికీ ఇవి ఆక్రమణకు గురైనట్టు తెలుస్తోంది. ఆలయాల చుట్టూ అడ్డుగోడ లేకుండా శిథిలావస్థలో ఉన్నాయి. పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లాల్సిన ఆలయాలు బోసిపోతున్నాయి. పురాతన ఆలయాలు దేవదాయ ధర్మాదాయశాఖ పరిధిలో ఉన్నా తగినన్ని నిధులు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదు. పురాతన ఆలయాలను అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.



పంచలింగేశ్వర ఆలయం



హిరణ్యేశ్వర ఆలయం

పార్టీ కోసం కష్టపడినవారికి గుర్తింపు



సభ్యత్వ నమోదులో రమేశ్‌గౌడ తదితరులు

మహదేవపుర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ పార్టీకోసి నిష్ఠతో పాటుపడినవారిని గుర్తించి రానున్న రోజుల్లో తగిన గుర్తింపు స్థానం కల్పించనున్నట్టు మాజీ ఎమ్మెల్సీ బెంగళూరు నగర విభాగం జేడీఎస్ అధ్యక్షుడు హెచ్‌ఎం రమేశ్‌గౌడ భరోసా ఇచ్చారు. మహదేవపుర నియోజకవర్గంలోని చల్లఘట్టలో ఆదివారం ఏర్పాటైన జేడీఎస్ సభ్యత్వ నమోదు అభియాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రానున్న రోజుల్లో నగరంలో బీబీఎంపీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. తద్వారా అత్యధిక స్థానాలు గెలుపొందే లక్ష్యంగా జేడీఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఉండాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ, జేడీఎస్‌ల మధ్య ఒప్పందం ఉండడం ద్వారా నియోజకవర్గంలో 2-3 వార్డులు జేడీఎస్‌కు లభించే అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు ఎవరైనా భారీ మెజారిటీతో విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. సీనియర్ నేత రవిప్రకాశ్ ఎన్నో ఏళ్లుగా పార్టీలో గుర్తింపు పొందడమే కాక రాజకీయంగా, సమాజసేవతో రాణిస్తున్నారన్నారు. ఆయన సేవలను గుర్తించి బెంగళూరు నగర కార్యాధ్యక్షుడిగా నియమించనున్నట్టు తెలిపారు. రవిప్రకాశ్ మాట్లాడుతూ తాను ఎట్టి పరిస్థితుల్లోనూ జేడీఎస్ వీడనన్నారు. సమావేశంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు రశ్మి రామేగౌడ, బెంగళూరు నగర ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే నిసర్గ నారాయణ స్వామి, నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు ఓబలేశ్, ఉత్తర లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు నాగేశ్, తుళసిరామ్, మహేంద్రకుమార్, వర్తూరు ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

దండు మారియమ్మకు విశేష పూజలు



ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే వెంకటమునియప్ప తదితరులు

బంగారపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కెసరనహళ్ళి గ్రామంలోని దండుమారియమ్మ ఆలయంలో విశేషపూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు మంజునాథ్ ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం అమ్మవారి ఆలయంలో విశేషపూజలు, అలంకరణలు చేశారు. అదే రీతిన కీలుకొప్ప మారియమ్మ, అత్తిగిరికొప్ప మారియమ్మ దేవికి విశేషపూల పల్లకీపై పురవీధులలో ఊరేగించారు. పదేళ్ల అనంతరం అమ్మవారికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాలనుంచి వేలామంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. జడ్పీ మాజీ సభ్యుడు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్ మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవాలని కోరుతూ పూజలు చేశామన్నారు. చెరువులు, కుంటలు నిండి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ అమ్మవారిని ప్రార్థించినట్టు తెలిపారు. ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే బీపీ వెంకటమునియప్ప, జడ్పీ మాజీ సభ్యుడు రామచంద్రప్ప, తాలూకా పంచాయతీ మాజీ సభ్యుడు కెసరహళ్ళి శివణ్ణ, హనుమప్ప, గ్రామపంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలల సంక్షేమంపై సన్నాహక సభ



చర్చాగోష్ఠిలో మంత్రి సుధాకర్, బయో ఇంధన అభివృద్ధి మండలి అధ్యక్షుడు సుధీంద్ర తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అనాథ బాలల సంక్షేమానికి సంబంధించిన జవహర్ బాలమంచ్ అఖిలభారత కాంగ్రెస్ పార్టీ వినూత్నంగా దూరదృష్టితో సరికొత్త పథకాన్ని సిద్ధం చేస్తోందని రాష్ట్ర బయో ఇంధన అభివృద్ధి మండలి అధ్యక్షుడు, కేపీసీసీ ఉపాధ్యక్షుడు ఎస్ఈ సుధీంద్ర అభిప్రాయపడ్డారు. నగరంలో ఆదివారం ఏర్పాటైన సన్నాహకసభలో భాగంగా చర్చాగోష్ఠిలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. బాలమంచ్ ద్వారా దేశంలో వసతి రహిత, వీధి పిల్లల సంక్షేమానికి నాంది కాగలదన్నారు. చరిత్రలో చోటు సంపాదించుకోనుందన్నారు. 7-17ఏళ్లలోపు అనాథ బాలల సంక్షేమానికి పలు కార్యక్రమాలను రూపొందించారన్నారు. బెంగళూరు నగరంలో సుమారు 1.1లక్షల మంది వసతి రహిత పిల్లలు ఉన్నట్టు అంచనాగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 80మిలియన్ల మంది ఉండగా ముంబైలో 1.5లక్షలు, ఢిల్లీలో 60వేలమంది ఉన్నట్టు తెలుస్తోందన్నారు. జవహర్ బాల్‌మంచ్ నుంచి ప్రముఖమైన రెండు పథకాలు ప్రముఖంగా ఉద్దేశించినట్టు పేర్కొంటూ డింగ్‌డాంగ్ బెల్ పథకం ద్వారా ఒక అనాథ బాలుడు లేదా బాలిక ఒక బొమ్మ లేదా సైకిల్ పొందవచ్చునన్నారు. మొహబ్బత్ కా దుకాన్ పథకం ద్వారా కులమత బేధాలకు అతీతంగా సహజీవనానికి దోహదపడనుందన్నారు. నవంబరు 14న జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బెంగళూరులో ఈ గొప్ప కార్యక్రమాలను అమలు చేయదలిచినట్టు తెలిపారు. వీధిపిల్లలకు ఆహారం అందించనున్నట్టు తెలిపారు. సన్నాహకసభలో రాష్ట్ర ఉన్నత వైద్యశాఖ మంత్రి సుధాకర్, డాక్టర్ జీవీ హరి, కేపీసీసీ జనరల్ సెక్రటరీ డీకే మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ నిరాకరించిందని... బైక్, కారుకు నిప్పు

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రేమ నిరాకరించిందని ఆవేశంతో ఆమె ఇంటి ముందు పార్కు చేసిన బైక్, కార్లకు నిప్పు పెట్టిన సంఘటన బెంగళూరు చన్నమ్మనకెరె అచ్చుకట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రౌడీషీటర్‌గా ఉండే రాహుల్ కొన్నేళ్లుగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఇటీవల యువతి రాహుల్‌కు దూరంగా ఉంటున్నారు. దీంతో రాహుల్ శనివారం రాత్రి యువతి ఇంటి వద్దకు వెళ్లి కారు, బైక్‌లకు నిప్పు పెట్టి వీరంగం చేశాడు. దీంతో యువతి కుటుంబసభ్యులు భయాందోళనకు గురయ్యారు. చన్నమ్మనకెరె అచ్చుకట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు రాహుల్ కోసం గాలింపులు చేపట్టారు.

నిరంతరం సామాజిక సేవలు



క్రికెట్ పోటీలలో కేపీసీసీ కన్వీనర్ రాజీవ్‌గౌడ తదితరులకు సన్మానం

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తుదిశ్వాస వరకు నిరంతరంగా సామాజిక సేవలు కొనసాగిస్తానని కేపీసీసీ కన్వీనర్ రాజీవ్‌గౌడ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని నెహ్రూ క్రీడామైదానంలో తన పుట్టినరోజు సందర్భంగా ఏబీడీ ట్రస్టు, అభిమానుల బళగ, ఎంసీసీ క్రికెట్ జట్టు ఆధ్వర్యంలో ఫ్లడ్‌లైట్ క్రికెట్ మ్యాచ్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల అనంతరం తాను అందుబాటులో ఉండననే విమర్శలను తోసిపుచ్చారు. నిత్యం తాను నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. డిగ్రీ విద్యార్థులకు ఐఏఎస్, కేఏఎస్ వంటి పోటీ పరీక్షలకోసం ఉచిత తర్ఫీదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థులకు అయ్యే ఖర్చును తానే పూర్తిగా భరిస్తానన్నారు. శిడ్లఘట్ట నుంచి యువతీ యువకులలో ఒకరైనా ఐఏఎస్, ఐపీఎస్, కేఏఎస్ ఉత్తీర్ణులైతే అదే చాలునని, శిడ్లఘట్ట తాలూకాకు గర్వకారణంగా ఉంటుందన్నారు. ఇదే సందర్భంగా పలువురిని వేదికపై ఆత్మీయంగా సత్కరించారు. అంతకుముందు ఆర్టీసీ బస్టాండ్ నుంచి కాంగ్రెస్ భవన్ వరకు ఊరేగింపుగా ర్యాలీగా సాగి. కాంగ్రెస్ భవన్‌లో కేక్ కట్ చేశారు. ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంధ విద్యార్థుల పాఠశాలలో అన్నదానం నిర్వహించారు. కార్య క్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సహనా రాజీవ్‌గౌడ, కృష్ణారెడ్డి, వరదణ్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు నైపుణ్య తరగతులు



విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులలో నైపుణ్యత కల్పించే దిశగా రీ ఇన్వెంటింగ్ ది రిపబ్లిక్ పేరిట ది సర్కిల్ ఇండియా సంస్థ అమలు చేసింది. నగరాలలో వెనుకబడిన ప్రాంతాలలో విద్యార్థుల కోసం డ్రాపౌట్స్‌కు నైపుణ్యత దిశగా మార్పులు తీసుకొచ్చేందుకు పనిచేస్తున్నట్టు ది సర్కిల్ ఇండియా వ్యవస్థాపకులు సందీప్ రాయ్ తెలిపారు. బెంగళూరు, ముంబై, పూనె నగరాలలో ఇన్వెంటింగ్ ది రిపబ్లిక్ కార్యక్రమాన్ని విజయవంతం చేశామన్నారు. నైపుణ్యత కల్పిస్తే వారిలో వచ్చే మార్పు ద్వారా జీవనశైలిలో నాణ్యత పెరుగుతుందన్నారు. ఆరు పాఠశాలలతోపాటు విద్య ముగించినవారికి కొన్ని శిక్షణలు ఇచ్చినట్టు తెలిపారు. బెంగళూరులో 770మంది విద్యార్థులలో మార్పు తీసుకొచ్చినట్టు సందీప్ తెలిపారు. ది సర్కిల్ ఇండియా 30కు పైగా విద్యాసంస్థల ద్వారా 5వేలమందికిపైగా 18 విభాగాలలో శిక్షణలు ఇచ్చామన్నారు. 2028 నాటికి 25వేలమందికి నైపుణ్యత కల్పించే లక్ష్యం కలిగినట్టు తెలిపారు.

మహాలింగేశ్వర ట్రస్టు ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): హెచ్ఏఎల్ మూడో స్టేజ్‌లోని మహాలింగేశ్వర సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ట్రస్టు అధ్యక్షులు బెళ్ళిపాడి గుణరంజన్‌శెట్టి తెలిపారు. మహాకుంభమేళాలో జరిగే కాలంలోనే మహాశివరాత్రి వేడుకలు జరుపుకోవడం ప్రత్యేకంగా భావిస్తున్నామన్నారు. కుంభమేళానుంచి తీసుకొచ్చిన పవిత్రజలాలతో ప్రోక్షణ చేస్తున్నామన్నారు. సిరిధాన్యాల ప్రసాదం అందించదలిచామని, 308 కళశాలతో పూజలు ఉంటాయన్నారు. ఈనెల 26న ఉదయం 9 గంటలకు శివలింగ ప్రాణప్రతిష్ఠతో ప్రారంభమై 26 గంటలపాటు నిరంతరాయంగా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మస్థైర్యం



రెడ్‌బెల్ట్ ప్రదానంలో గ్రాండ్‌మాస్టర్ కుమార్ తదితరులు

మహదేవపుర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ద్వారా ఆత్మస్థైర్యం పెరిగి జీవితంలోని కష్టాలను అధిగమించే సామర్థ్యం సాధ్యం అవుతుందని గ్రాండ్‌మాస్టర్ ఎన్ కుమార్ అభిప్రాయపడ్డారు. వైట్‌ఫీల్డ్‌లోని ప్రైవేట్ పాఠశాలలో ఒకినోవా శోరిన్ కరాటే డూ, కోబు జుట్సు అసోసియేషన్ ఇండియా నిర్వహించిన అంతర్జాతీయ గ్రాండ్ మాస్టర్ సదస్సులో పాల్గొని మాట్లాడారు. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నవారు ఇతరులకంటే భిన్నంగా ఉంటారన్నారు. ఈ కళ నేర్చుకోవడం ద్వారా ఆలోచనా శక్తి, మానసిక స్థిరత్వం, శారీరక బలం, కళాత్మకమైన వ్యూహాలు సమన్వయంగా ఉంటాయన్నారు. ప్రస్తుతం అన్ని వయస్సులవారు మార్షల్ ఆర్ట్స్‌ను క్రీడగా అభ్యసిస్తున్నారన్నారు. జపాన్‌కు చెందిన 93ఏళ్ల గ్రాండ్‌మాస్టర్ టెంట్సు టకమియోగి, కేరళకు చెందిన గ్రాండ్ మాస్టర్ కేపీ రవీంద్రన్ సదస్సులో పాల్గొని కుంగ్‌ఫూ, కరాటే, మార్షల్ ఆర్ట్స్ పద్ధతులను వివరించి పిల్లల్లో ఉత్సాహం నింపారు. ఇదే సందర్భంగా దేశ రెండో గ్రాండ్‌మాస్టర్ ఎన్ కుమార్‌కు రెడ్‌బెల్ట్‌ను ప్రదానం చేశారు.

పేకాట స్థావరంపై దాడి - ముగ్గురి అరెస్టు

ముళబాగిలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ముళబాగిలు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సన్యాసనహళ్ళి వద్ద వెంకటరమప్పకు చెందిన మామిడితోటల జూదం ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. కోలారు జిల్లా ఎస్పీ నిఖిల్ సూచన మేరకు సీఈఎన్ స్టేషన్ అధికారి జగదీశ్ బృందం కార్యాచరణ నిర్వహించారు. ముగ్గురిని అరెస్టు చేసి రెండుకార్లు, 7 ద్విచక్రవాహనాలు, రూ.21,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సన్యాసపల్లికి చెందిన విజయకుమార్, పళ్ళిగరపాళ్యకు చెందిన వెంకటేశ్, వేగమడుగుకు చెందిన రవీంద్ర అరెస్టు అయ్యారు. నారాయణస్వామి, సుబ్రమణి, కిశన్ కుమార్, రాహుల్,, ప్రసన్నకుమార్, రేవణ్ణ, జగదీశ్ తదితరులు పరారీ అయ్యారు. భూ యజమానిపైనా, నిందితులపైనా కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేపట్టారు.

మరదల్ని హత్య చేసి పరారీకి యత్నం

● వ్యక్తిని బంధించిన గ్రామస్థులు



స్తంభానికి శివాజి కమ్మారను కట్టేసిన దృశ్యం

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆస్తి విషయమై తమ్ముడి భార్య (మరదల్ని) హత్య చేసి పరారీ అయ్యేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని గ్రామస్థులు పట్టుకుని స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ధారవాడ జిల్లా కలఘటగి తాలూకా హుళకొప్ప గ్రామంలో దారుణ సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సక్కుబాయి బసప్ప కమ్మార (35) హత్యకు గురయ్యారు. సక్కుబాయి గొంతుకు తాడుతో బిగించి హతమార్చిన భర్త అన్న శివాజి కమ్మార పరారీ అయ్యేందుకు ప్రయత్నించాడు. గ్రామస్థులు గుర్తించి అతడిని పట్టుకుని ఓ స్తంభానికి కట్టేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ నారాయణ్ భరమణి గ్రామాన్ని సందర్శించారు.

గీతామందిరంలో వైద్య పరీక్షలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడేపల్లి గీతామందిరంలో ఏకల్ ఆరోగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఆస్టర్ వైద్యశాల వైద్యులు కిరణ్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 94 మందికి పరీక్షలు నిర్వహించి.. 34 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా కంటి అద్దాలు అందచేస్తామన్నారు.

శ్రీహరి సత్సంగ సమితి సమావేశం

స్థానిక చౌడేపల్లి గీతామందిరిలో ఆదివారం ఏకల్ అభియాన్ ఆంధ్రప్రదేశ్ శ్రీహరి సత్సంగ కార్యకర్తల సమితి గ్రామ భజన సమావేశం నిర్వహించారు. కదిరి ఆచల్ సమితి అధ్యక్షుడు రాధక్రిష్ణ మాట్లాడుతూ గ్రామ సమితి కార్యకర్తలు చేయాల్సిన పనులను వివరించారు. కార్యక్రమంలో ఓడీసీ సత్‌సవితి అధ్యక్షుడు క్రిష్ణమూర్తి, దక్షణాంధ్ర అభియాన్ ప్రముఖ్ తిరుపాల్, పిసంస్కార్ సహదేవుడు, సుబ్బరాయుడు, గ్రామ కమిటీ కార్యకర్తలు పాల్గొన్నారు.